క్లుప్తంగా

గ్రావెల్ క్వారీని అడ్డుకున్న గ్రామస్తులు

విజయపురం: మండలంలోని మహారాజపురంలో గ్రావెల్ తరలింపునకు దారి ఏర్పాటు చేయడాన్ని గమనించిన గ్రామస్తులు శుక్రవారం వాటిని అడ్డుకున్నారు. ఇక్కడ గ్రావెల్ తవ్వడానికి ఎలాంటి అనుమతులు లేవని, వెంటనే ఇక్కడ ఉన్న జేసీబీ, ఇతర వాహనాలను బయటకు తరలించాలని సూచించారు. దీంతో గ్రావెల్ తవ్వకాల పనులు ఆగిపోయాయి.

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడి రాజీనామా



రాజీనామా లేఖను సమర్పిస్తున్న నారాయణస్వామి

పుత్తూరు: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు జి.నారాయణస్వామి శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయిన నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేసినట్టు తెలిపారు. ఈ మేరకు ఆయన రాజీనామా లేఖను ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి.కృష్ణకాంత్‌కు అందజేశారు.

వరి పంట పరిశీలన

విజయపురం: మండలంలో సాగు చేసిన వరి పంటను శుక్రవారం ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్ర శాస్త్రవేత్త రెడ్డిరాయులు, నాగమణి మాట్లాడుతూ వరి సాగులో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. ప్రధానంగా ఆకు ముడత పురుగు ఎక్కువగా ఆశిస్తుందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యవసాయాధికారి సూచనల మేరకు ముందులు పిచ్చికారీ చేయాలని సూచించారు. రబీలో పచ్చిరొట్టె ఎరువుపై దృష్టి పెట్టాలని, విత్తన శుద్ధి చేయాలన్నారు. నాణ్యమైన విత్తనాలు ఎంపికపై అవగాహన కల్పించారు. వారి వెంట ఏవో నాగపద్మని, భాగ్యలక్ష్మి, యామిని, రజని తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పుత్తూరు: పట్టణ పరిధిలోని ఈశ్వరాపురం, లక్ష్మీనగర్ వద్ద గల 33/11 కేవీ సబ్‌స్టేషన్లలో శనివారం మరమ్మతులు చేపడుతున్నట్టు ఏఈ రవిచంద్రన్ తెలిపారు. ఈ క్రమంలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బయోఎంజైమ్ తయారీపై శిక్షణ

తిరుపతి కల్చరల్: ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారి ఆధ్వర్యంలో శుక్రవారం రైల్వే కాలనీలోని సరస్వతి శిశుమందిరంలో పండ్ల తొక్కలతో సంప్రదాయబద్ధంగా శుభ్రత కోసం ఇళ్లల్లో ఉపయోగించే బయోఎంజైమ్ తయారీపై మహిళలకు శిక్షణ కల్పించారు. ఈ సందర్భంగా అగ్రికల్చరల్ కళాశాల రిటైర్డ్ ప్రొఫెసర్ కీర్తి వెంకయ్య ఈ కార్యక్రమానికి విచ్చేసి మాట్లాడారు. ఇంటిలో శుభ్రం చేసుకునేందుకు మార్కెట్‌లో దొరికే రసాయనిక పదార్థాలు హానికరమైనవి, ఇవి తాగునీటిని భూగర్భ జలాలను కలుషితం చేస్తాయని తెలిపారు. ఇది భూమి మీద నివశించే జీవరాశులకు, మానవాళికి ప్రమాదకరమని తెలిపారు. వాటికి ప్రత్యమ్నంగా సూక్ష్మజీవుల సహాయంతో తయారు చేసే బయో ఎంజైమ్ పర్యావరణానికి హానికరం కాదన్నారు. పర్యావరణానికి హాని చేయని బయో ఎంజైమ్‌ను వినియోగించడం శ్రేయష్కరమన్నారు. పండ్ల తొక్కలతో వాటిని ఎలా తయారు చేయాలని, మార్కెట్ ఎలా చేయాలని అంశాలపై మహిళలకు అవగాహన కల్పించడంతో పాటు వారికి శిక్షణ ఇవ్వడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో హేమంత్‌కుమార్, శ్రీదేవి, ఎస్వీ ఆయుర్వేదిక్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ దత్తాత్రేయ పాల్గొన్నారు.

శ్రీశక్తిపీఠంలో ఏపీ టూరిజం రీజనల్ డైరెక్టర్



వేద పండితుల ఆశీర్వచనం తీసుకుంటున్న రమణ ప్రసాద్, కుటుంబ సభ్యులు

రామచంద్రాపురం: మండలంలోని రాయలచెరువు సమీపంలోని శ్రీశక్తిపీఠంలో ఏపీ టూరిజం రీజనల్ డైరెక్టర్ రమణ ప్రసాద్ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పీఠ నిర్వాహకులు ఆయనకు స్వాగతం పలికి అమ్మవారి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం పీఠంలో కొలువైన శ్రీవారాహీదేవికి, శ్రీమరకతశక్తి కాళీదేవి, శ్రీకుష్మాండదేవికి ప్రత్యేక పూజలు చేసి ముడుపులు సమర్పించారు. ఈ క్రమంలోనే శ్రీశక్తిపీఠం వ్యవస్థాపకుడు కుర్తాళం పీఠాధిపతి శ్రీ సిద్ధేశ్వరానంద భారతీస్వామి, మాతాజీ రమ్యానంద భారతీ ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో అలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉసిరి.. లాభాల సిరి



ఉసిరితోట



ఉసిరి చెట్టు

పోషకాల సిరి ఉసిరి రైతులకు సిరులు కురిపిస్తోంది. ఒక్కసారి సాగు చేస్తే 40 ఏళ్ల పాటు దిగుబడి వస్తుంది. సాగు ఖర్చులు కూడా తక్కువే. పంట సాగుకు ప్రభుత్వం హెక్టారుకు రూ.18 వేల రాయితీ కూడా ఇస్తోంది. దీంతో మండలంలోని రైతులు ఉసిరి తోటలు సాగు చేయడానికి ముందుకు వస్తున్నారు.

–విజయపురం

- రైతుకు అదనపు ఆదాయం
- ఒక్కసారి సాగుచేస్తే 40 ఏళ్ల వరకు దిగుబడి

పండించే పంట దిగుబడి లేదని, దిగుబడి బాగా వచ్చినా ధర పలకలేదని ఆందోళన చెందే రైతును ఉసిరి ఆదుకుంటోంది. ఏడాడికి రెండుసార్లు ఫలసాయాన్ని అందిస్తూ తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఇస్తోంది. ఉసిరిలో ఎక్కువగా ఔషధ గుణాలు ఉండడం, రోగనిరోధక శక్తిని కలిగిస్తుండడంతో మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అందుకే ప్రతి ఒక్కరూ జీవిత కాలంలో ఐదు ఉసిరి మొక్కలయినా నాటాలని పూర్వీకులు చెబుతారు. శరీరంలో రోగ నిరోధకశక్తి పెరగాలంటే సి – విటమిన్ ఎక్కువగా ఉండే పండ్లూ, కూరగాయలూ తినాలి. కరోనా పుణ్యమా అని ఈ విషయం మాటలు సరిగ్గా రాని పసివాళ్ల నుంచి వృద్ధుల వరకూ తెలియడంతో ఉసిరి సాగుపై ఆసక్తి నెలకొంది. మండలంలోని విజయపురం, మిట్టూరు, శ్రీహరిపురం, కాకవేడు ప్రాంతాల్లోని రైతులు ఉసిరి పంటను సాగు చేస్తున్నారు. రెండు మండలాల్లో సుమారు 200 ఎకరాల్లో ఉసిరి సాగవుతోంది. రైతులు తమిళనాడులోని తంజావూరు నుంచి మొక్కలను తెచ్చుకుని నాటుకుంటున్నారు. ఒక్కసారి మొక్కలు నాటితే రెండేళ్లకు కాపు వస్తుంది. ఏడాదికి రెండుసార్లు ఫలసాయం అందుతోంది. ఎకరాకు 200 మొక్కలు నాటి సాగుచేసిన రైతులు చెట్టు పెరుగుదలను అనుసరించి ఎకరాకు రెండు నుంచి 5 టన్నుల వరకు దిగుబడిని పొందవచ్చు. ఉసిరి 30 నుంచి 40 ఏళ్ల వరకు ఫలసాయం అందుతుందని ఉద్యానవన అధికారులు తెలుపుతున్నారు. ఉసిరి చెట్టు నీటి ఎద్దడిని చాలా వరకు తట్టుకుంటుంది. చీడపీడలు, తెగులు ఎక్కువగా ఆశించవు. ఈ కారణంగా సాగు ఖర్చు తగ్గుతుంది. రాబడిలో ఖర్చు 10 శాతం మాత్రమే ఉంటుంది. డిమాండ్‌ను బట్టి టన్నుకు రూ.30 వేల నుంచి 50 వేలు వరకు ధర పలుకుతుంది.

మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు తరలింపు

నగరి, విజయపురం మండలాల్లో సాగు చేసే ఉసిరి మన రాష్ట్రంలోని కర్నూలు, గుంటూరు, తెనాలితో పాటు తమిళనాడులోని చెన్నై, తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌లో గల ఫ్యాక్టరీలకు ఎగుమతి అవుతోంది. ఉసిరితో మందులు, సిరప్‌లు, ఆయిల్, సోపు, ఊరగాయలు తయారు చేసి మార్కెట్లో విక్రయిస్తారు.



ఉసిరికాయలు

ఉసిరి సాగు లాభాలనిస్తోంది

నేను పదిహేనేళ్ల క్రితం నుంచి ఉసిరి సాగు చేస్తున్నాను. తమిళనాడులోని తంజావూరు నుంచి మొక్కలను తెచ్చుకున్నాను. ఏడాదికి రెండు సార్లు కాపు వస్తోంది. తెగుళ్ల, చీడపీడల సమస్య ఎక్కువగా ఉండదు. పంట మధ్య కలుపు పెరగకుండా చూసుకుంటూ, చెట్లను పరిశీలించి కొంతమేరకు తెగులు రాకుండా మందులు స్ప్రే చేసుకుంటే చాలు. మంచి దిగుబడి చూడవచ్చు. డిమాండ్‌ను అనుసరించి ఎకరాకు రూ.లక్ష వరకు లాభం వస్తుంది.

– జయరామయ్య, విజయపురం మండలం

నేడు లక్ష్మీ నరసింహస్వామికి అభిషేకాలు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంటలో ఉన్న వినాయక లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు న్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త మిట్టపల్లె సుబ్రమణ్యంరెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేకువజామునే స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి భక్తి ప్రపత్తులతో అభిషేకాలు, వివిద రకాల అలంకరణ మధ్య విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అదే రోజు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ద్రౌపదీ దేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో భక్తిప్రపత్తులతో అమ్మవారికి భక్తి పాలాభిషేకం చేశారు. వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో అమ్మవారిని ముస్తాబు చేశారు. విశేష పూజలనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

ప్రోత్సహిస్తే పిల్లలు అద్భుతాలు సృష్టిస్తారు



సర్టిఫికెట్లు అందుకొన్న విద్యార్థులతో గ్రంథాలయ అధికారి మీనాకుమారి

- విజయవంతమైన సమ్మర్ క్యాంప్
- గ్రంథాలయాధికారి మీనాకుమారి

పుత్తూరు: పిల్లలను ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారని గ్రంథాలయాధికారి కె.మీనాకుమారి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పలువురు విద్యార్థులు ఈ సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రభుత్వ లక్ష్యం నెరవేరిందన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం ఉంటే పిల్లలు అద్భుతాలు సృష్టిస్తారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ఆలోచనా ధృక్పథానికి తగ్గట్టుగా సహకరించాలని సూచించారు. క్యాంపులో కథలు చెప్పడం, పుస్తక పఠనం, డ్రాయింగ్, మెడిటేషన్, స్పోకెన్ ఇంగ్లీష్ వంటి పలు అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. గత నెల 15వ తేదీన ప్రారంభమైన సమ్మర్ క్యాంపు 24 రోజుల పాటు కొనసాగడం విశేషమన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది సుజాత తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు ఐరన్ మాత్రలు వాడాలి



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: గర్భిణులు తప్పనిసరిగా ఐరన్ మాత్రలను ప్రతి రోజూ వాడాలని డాక్టర్ ప్రియాంక తెలిపారు. మండలంలోని ఎగువ తవణంపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక 37 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక పరీక్షలు చేసి సూచనలు, సలహాలిచ్చారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులకు తవణంపల్లె పీహెచ్‌సీలో ప్రసవం చేయించే సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సౌకర్యాన్ని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మత్యంలో ఫ్యామిలీ డాక్టర్

మండలంలోని మత్యంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ వినయ్‌కుమార్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులతో పాటు గర్భవతులు, బాలింతలకు పరీక్షలు చేయించి మందులు అందజేశారు. గర్భవతులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని కోరారు. క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, ఆరోగ్య కార్యకర్తలు శ్రీనివాసులు, సుబ్రమణ్యం రెడ్డి, తులసమ్మ, శ్రీదేవి, ఎంఎల్‌హెచ్‌పీలు జాహ్నవి, భార్గవి, డీఈఓ విజయలక్ష్మి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ముత్తుమారియమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి అంబలి పోసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు

పాలసముద్రం: శ్రీకావేరిరాజుపురం గ్రామంలో వెలసిన ముత్తుమారియమ్మకు శుక్రవారం గ్రామస్తులు అంబలి పోసి, ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం అమ్మవారిని పాలు, పెరుగు, చందనం, నెయ్యి, తేనెతో వివిధ అభిషేకం చేశారు. మధ్యాహ్నం ప్రతి ఇంటికి నుంచి మహిళలు పంబ వాయిద్యాలతో అంబలి, పూజసామగ్రితో పుర వీధుల్లో ఊరేగించి అమ్మవారి ఎదుట అంబలి పోశారు. సాయంత్రం పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. పుత్రసంతానం, పెళ్లి కాని యువతులు పిండి దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.

జూనియర్ ఇంటర్ అడ్మిషన్లు ప్రారంభం

బంగారుపాళెం: మండల కేంద్రంలోని పీవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ వందనా త్రిపాఠి శుక్రవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ, కళాశాలలో అధునాతన వసతులతో కూడిన భవన సదుపాయాలు ఉన్నట్లు తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఈఈటీ, ఏఅండ్‌టీ, సెరికల్చర్ గ్రూప్‌లు తెలుగు, ఇంగ్లీషు మీడియం అందుబాటులో ఉన్నాయన్నారు. నైపుణ్యం కలిగిన బోధనా సిబ్బంది ఉన్నట్లు చెప్పారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మొదటి సంవత్సరంలో చేరడానికి అవసరమైన సర్టిఫికెట్లతో వచ్చి అడ్మిషన్లు పొందాలని కోరారు. ఈ అవకాశాలన్నీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అడ్మిషన్ల కోసం కళాశాలలో సంప్రదించాలని కోరారు.

గొల్లపల్లిలో శిలాఫలకం ధ్వంసం



గొల్లపల్లిలో ధ్వంసమైన శిలాఫలకం

పుత్తూరు: మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామ సచివాలయం వద్ద వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆర్కే రోజా పేరిట ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని టీడీపీ నాయకులు శుక్రవారం ధ్వంసం చేశారు. గ్రామ సచివాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మహిళా సమాఖ్య భవనం, రైతు భరోసా కేంద్రం వంటి ప్రభుత్వ భవనాల సముదాయం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేశారు. ఈ సంఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ వెంకటమోహన్ తెలిపారు.

ముగిసిన గ్రంథాలయ వేసవి శిక్షణా తరగతులు



సర్టిఫికెట్లతో విద్యార్థులు

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి గజేంద్రబాబు ఆధ్వర్యంలో గత నెల నుండి పాఠకులకు, విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా గజేంద్రబాబు మాట్లాడుతూ స్పోకెన్ ఇంగ్లీష్, అబాకస్, డ్రామా, డ్యాన్స్ డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్ తదితర కార్యక్రమాలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చామని, ముగింపు చివరి రోజున విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశామని తెలిపారు. ఈ సంవత్సరం వేసిన వేసవి శిక్షణ శిబిరంలో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారని గ్రంథాలయ అధికారి గజేంద్రబాబు తెలిపారు.

ఉన్నత లక్ష్య సాధనకు కృషి చేయాలి

తిరుపతి సిటీ: విద్యార్థులు ఉన్నత లక్ష్య సాధనకు కృషి చేయాలని కెనరా బ్యాంక్ జనరల్ మేనేజర్ బి చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎస్వీ అగ్రికల్చరల్ కళాశాల 63వ వార్షికోత్సవ వేడుకలు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. వ్యవసాయ విద్యను అభ్యసించిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. బ్యాంకింగ్, బీమా రంగాలలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రూప్స్, సివిల్స్ వంటి పోటీ పరీక్షలు లక్ష్యంగా కష్టపడాలని సూచించారు. అనంతరం డీన్ ఆఫ్ అగ్రికల్చర్ యూనివర్సిటీ డాక్టర్ జి కరుణాసాగర్ మాట్లాడుతూ ఎన్జీరంగా వర్సిటీ పరిధిలోని కళాశాలలో అంతర్జాతీయ స్థాయి విద్యను అందిస్తున్నామని తెలిపారు. అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.ప్రభాకరరెడ్డి కళాశాల అభివృద్ధి, సాధించిన విజయాలు, విద్యాప్రమాణాలపై వార్షిక ప్రగతి సభకు వివరించారు.

వంగతో లాభాలు మెండు



వంగ తోటలో కలుపు తీస్తున్న కూలీలు

పాలసముద్రం: వంకాయ సాగులో చీడపీడలు నివారిస్తే ఏడాది పొడవునా దిగుబడి పొందవచ్చు. వంకాయలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.కొద్దిపాటి జాగ్రత్తలు వహిస్తే నాణ్యమైన పంట చేతికొస్తుంది. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించి తెగుళ్లు నివారిస్తే మంచి ఆదాయం ఆర్జించవచ్చని మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ సూచించారు.

మేలైన విత్తనాల ఎంపిక

మేలు రకాలైన వంకాయ విత్తనాలు ఎంపిక చేసుకోవాలి. సరైన పద్ధతిలో సాగు చేస్తే నాణ్యమైన దిగుబడి సాధించవచ్చు. వంగ రకాల్లో భాగ్యవతి, అర్కకుసుమాకర్ ,హైబ్రీడ్, అర్కషీల్ రకాలైన మహికో, రవయ్యా, సుఫల్ కూడా ఉన్నాయి. విత్తన రకాలను బట్టి దిగుబడులు వస్తాయి.

- **భాగ్యవతి రకం:** చెట్టుకు మూడు నుండి నాలుగు కాయలు ఉంటాయి. ఊదా రంగులో అండాకారంగా కాయలు ఉంటాయి. పంటకాల పరిమితి 140 నుంచి 160 రోజులు. ఇది నీటి ఎద్దడి బాగా తట్టుకునే శక్తి కలిగి ఉంటుంది. హెక్టార్‌కు 25 నుంచి 30 టన్నులు దిగుబడి వస్తుంది.
- **అర్కషీల్ రకం:** కాయలు మధ్యస్థంగా పొడవుగా ఆకర్షణీయమైన ముదురు ఊదా రంగులో ఉండి గింజలు తక్కువగా ఉంటాయి. కాలపరిమితి 110 రోజుల నుంచి 120 రోజులు. హెక్టారుకు 380 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది.
- **అర్కకుసుమాకర్ రకం:** కాయలు చిన్నగా వేలు ఆకారంతో, ఆకు పచ్చరంగులో ఉంటాయి. కాయలు ఐదు నుంచి ఏడు వరకు గుత్తులుగా కాస్తాయి. మొక్కకు 70 నుంచి 75 వరకు కాయలు దిగుబడి వస్తాయి. కాలపరిమితి 110 నుండి 120 రోజులు. హెక్టారుకు 35 టన్నులు వరకు దిగుబడి వస్తుంది.

ఎరువు వాడే విధానం

ఆఖరి దుక్కులో హెక్టార్‌కు 60 కిలోల పొటాష్, భాస్వరాన్ని ఇచ్చే ఎరువు వాడాలి. హెక్టార్‌కు వంద కిలోల నత్రజని మూడు భాగాలుగా చేసి నాటిన సమయంలో 30వ రోజు, 75వ రోజున వేయాలి. ఎరువు వేసిన సమయంలో కలుపు తీసి, గొర్రు తవ్వి మట్టిని సవరిస్తే పంట దిగుబడి పెరుగుతుంది. భూమిలో తేమను బట్టి, వేసవిలో 4 నుంచి 5 రోజులకు శీతాకాలంలో 7 నుంచి 10 రోజులకో సారి, వర్షాకాలంలో అవసరాన్ని బట్టి నీరు కట్టాలి.



సన్నగుంట గ్రామంలో సాగులో ఉన్న వంగ తోట

పురుగు నివారణ చర్యలు

పిండి పురుగుల కారణంగా మొక్కలు గిడసబారుతాయి. దీని నివారణకు మలాథియాన్ ఐదు మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పురుగు ఆశించిన రెమ్మలు, కాయలను ముందుగా తీసి నాశనం చేయాలి.

- రసం పీల్చే పురుగులు ఆకుల అడుగు భాగాన ఉండి రసాన్ని పీలుస్తాయి.ఆకులు వడలి పసుపు రంగుకు మారి ఎండిపోతాయి. దీని నివారనకు డైమిథోయేట్ 30 శాతం ఇ.సి మందు రెండు మిల్లీ లీటర్లు చొప్పన ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- అక్షింతల పురుగు పెద్ద పురుగులు, పిల్లపురుగు ఆకుల్లో పత్రహరితాన్ని తినేసి ఈనెలను మిగులుస్తాయి. ఆకు జల్లెడ మాదిరిగా కనిపిస్తుంది. ఆకులు ఎండిపోయి మొక్కలు శక్తిహీనంగా ఉంటాయి. దీని నివారణకు 0.16 శాతం మలాథియాన్ 3 మిల్లీ లీటర్లు గానీ 0.03 శాతం మిథైల్ పెరాథియాన్ ఒక మిల్లీలీటర్లు గానీ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.
- మొవ్వ, కాయ తొలుచు పురుగు చిరుమొవ్వ దశలో ఉన్నప్పుడు ఆశించడంతో మొక్కలు వంగిపోతాయి. కాపు దశలో కాయలను తొలిచి అంచెలంచెలుగా కాయ లోపలికి చేరుతాయి. దీని నివారణకు పురుగు ఆశించిన, వంగిన రెమ్మలను తీసివేసి 50 శాతం డబ్ల్యూపీ 2.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. లేదంటే మోనోక్రోటోఫాస్ 1.25 మిల్లీలీటర్లు లీటరు నీటిలో కలపి పిచికారీ చేయాలి. ఈ మందు పిచికారీ చేసిన పది రోజుల తర్వాత కాయలు కోవాలి.

తెగుళ్ల నివారణ

ఆకు ముడత తెగులు సోకిన ఆకులపై అక్కడక్కడా గోధుమ రంగుతో కూడిన మచ్చలు కనిపిస్తాయి. ఉధృతంగా తెగులు సోకితే ఆకులు రాలిపోతాయి. ఈ తెగులు సోకిన కాయలు పసుపు(ముదురు)రంగులోకి పూర్తిగా మారకముందే ఎండిపోతాయి. దీని నివారణకు బ్లైటాక్స్ 3 గ్రాములు లీటరు నీటిలో లేదా 2.5 గ్రాములు జినేట్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

- వెర్రి తెగులు ఆశించిన ఆకులు పాలిపోయిన ఆకుపచ్చ రంగును కలిగి ఉంటాయి. వీటి నివారణకు తెగులు సోకిన మొక్కలను పెరికి వేయాలి. తెగులు వ్యాపింపజేసే చీడలను క్రిమిసంహారక మందులను ఉపయోగించి నివారించాలి.